# మహారాజు - రామయ్య

జయంతి శ్రీరామమూర్తి

మోటారుసైకిలు ఫర్లాంగు దూరంలో వుండనగానే దొరగారి రాక ఆనవాలు కట్టేశాడు రామయ్య వెంటనే వీధిగేటు తెరచి, ఈ బుజం మీది తువ్వాలు ఆ బుజంమీదికి మార్చుకు నిలబడ్డాడు. యింతలో మోటారుసైకిలు తుస్సున దూసుకువచ్చింది లోపలికి. రామయ్య సలాం పెట్టేడు. కాని. లైట్ల కాంతిలో అది దొరగారికి కనిపించి వుండదు. ఒకవేళ కనబడ్డా, తిరిగి సలాం చెయ్యడానికి వారి చేతులేమంత చవకగా లేవు. ఆఫీసులో జెమాజెట్టీల్లాంటి ఉద్యోగస్థులకే ఆయన తలైనా ఆడించనప్పుడు, ఈ నౌకరు రామయ్య వో లెఖ్ఖా! అందులోనూ రామయ్యంటే ఈమధ్య ఆయనకి మరీ వొళ్ళు మండుతూంది. అసలు చిక్కేమిటంటే నెలజీతం నల్భైరూపాయలూ నెల నెలా ఒకటో తారీకురాత్రే తీసుకువెళ్ళి పదో తేదీ గడవకుండానే తినేసేనంటాడు. పిడికోలదీ రొట్టె చేసుకోమని తానెన్ని సార్లు చెప్పినా అరణ్యరోదనమే. ఇక వాడివిషయంలో బిర్రబిగిసి వుండడమే మంచిదని నిశ్చయించుకున్నారు దొరగారు. రానురాను వాడుమరీ మితిమీరి పోతున్నాడు. అన్నంలేదని మొహం వ్రేలాడవెయ్యడమూ, సబ్బులేదని మురికిబట్టలతో రావడమూ అన్నివిధాలా పరమదరిద్ర గొట్టులా తయారవుతాడు. అందులో ఈవేళ ఒకటోతారీకు. జేబునిండా డబ్బువుందాయె: వాడిమొహం ఎంత దూరంగావుంటేఅంతమంచిదనుకున్నారు దొరగారు.

మోటారుసైకిలు ఆగీఆగగానే రామయ్య పరుగెత్తి వెనకనుంచి పట్టుకున్నాడు. దొరగారు దిగి, వెనక్కైనా చూడకుండా లోనికి పరుగెత్తేరు. భార్య గుమ్మందగ్గర నిలబడి చిరునవ్వుతో స్వాగతమిచ్చింది. ఆమె వెంటనే వెళ్ళి దొరగారి కోటూ, మెడలోని టై స్వయంగా విప్పి హేంగరుకు తగిలించింది. "రామయ్యా"అని పిలిచి వేన్నీళ్లు సిద్ధం చెయ్యమంది. "చిత్తం" అంటూ ఎలావచ్చేడో అలా పరుగెత్తేడు, రామయ్య. మళ్ళీ ఆమె దొరగారి జోళ్లు విప్పి కాస్త, మంచీ చెడ్డా ముచ్చటిస్తుండగా రామయ్యవచ్చి, "నీళ్లు సిద్ధంగా వున్నాయండీ" అన్నాడు.

దొరగారు అతనికేసి ఎగాదిగా చూస్తూ "అవును, ఈవేళ ఎంతత్వరగా నేను స్నానంచేస్తే అంత మంచిది నీకు కదూ!"అన్నారు. రామయ్య ఏమీ మాట్లాడలేదు. ఏం మాట్లాడడానికీ అతనికి తోచలేదుకూడా మళ్ళీ దొరగారే అందుకుని, అవును ఒకటోతారీకుకోసం వెయ్యినోళ్ళు తెరచుకొని ఆవురావురు మంటూ కూర్చుంటావు" అన్నారు. రామయ్యకి నిజానికి కోపంవచ్చింది. "ఎన్నినోళ్లు తెరచినా తమరిచ్చేది అంతేగదండీ!" అందామనుకున్నాడు గాని, పోనీలే, "పెద్దవాళ్ళు చెడ్డవాళ్లు కారు" అని సరిపెట్టుకు వూరుకున్నాడు. దొరగారు విస్సాటంగాలేచి స్నానాల గదికి వెళ్ళేరు.

కథానిక

స్నానం ముగించి భార్యాభర్తలు డైనింగు రూములో కూర్చున్నారు. బేరరు పెట్టిన వంటకాలతో టేబిలు క్రిక్కిరిసివుంది. రామయ్య బైట వరండాలో కూర్చుని మధ్యమధ్య దొరగారి భోజనం ఎందాకా వచ్చిందా అని తొంగితొంగి చూస్తున్నాడు. అతనికి తొందరెందుకంటే ఈవేళ ఉదయంనుంచీ తనయింట్లో అందరూ పస్తే – ఈ రాత్రి దొరగారు జీతమిస్తే, అప్పటిదాకా దుకాణాలు తెరచివుంటే రామయ్య బియ్యం కొనుక్కు వెళ్ళాలి. కాసిన్ని మెతుకులు తిని భార్యాపిల్లలూ పడుకోవాలి. తానెంతగా దొరగారు భోజనం ముగించాలని త్వరపడుతున్నాడో, వాళ్ళూ తన రాకకోసం అంతగా ఎదురు చూస్తుంటారు. రామయ్య మళ్ళీ తొంగిచూసేడు లోనికి. దొరగారు గులాబ్జాం రసం చెమ్చాతో జుర్రుతున్నారు. బేరరు ఇంకొరెండు వడ్డిస్తున్నాడు. రామయ్య కళ్లు వెనక్కి లాగేసుకుని నలువైపులా కలయ చూసేడు ఎవరేనా తన్ని చూస్తున్నారేమోనని. కాస్తసేపు కళ్లుమూసుకుని ఏమీ ఆలోచించకుండా

ఉందామనుకున్నాడు కాని, సాధ్యంకాలేదు. అతని మనస్సేమన్నా గుర్రమా కళ్ళెం బిగించి ఉంచడానికి! మళ్ళీ గదిలోకి తొంగిచూసేడు. దొరగారు పూరీలు అమ్మగారికి బలవంతాన వడ్డించబోతున్నారు. ఆమె వద్దని రెండు చేతులూ అడ్డు పెడుతూంది.

"అలాకాదు. ఒక్కటి వేసుకో నా కోసం" అన్నారాయన.

"తినలేను. పారవెయ్యాలి"...ఆమె.

"వెయ్యడమే నావంతు. ఆపైన తిను. పారెయ్-నీవంతు" అన్నారు యజమాని.

రామయ్యకు చెమటలు పోస్తున్నాయి. ఎంతసేపైనా ఆయన భోజనం ముగియడంలేదు. 'కాలచక్రం ఆగిపోయిందా' అనిపించిందతనికి; లోపల కడుపుతో కామన్న గంతులేస్తున్నాడు. అతడు వెంటనేలేచి తోటలో కుళాయివద్దకు నడిచేడు కాసిన్ని మంచినీళ్ళయినా త్రాగుదామని.

రామయ్య తిరిగివచ్చి తెరచాటునుంచి మళ్ళీ తొంగిచూసేడు. అయ్యగారూ, అమ్మగారూ ఏపిలు పండ్లు కోసుకుతింటూ సావకాశంగా కబుర్లుచెప్పుకుంటున్నారు. రామయ్య కళ్లు పైనక్కివచ్చి ఆకాశంవైపు మళ్లేయి. నక్షత్రాలు అనంతంగా పైన మినుకుమినుకుమంటున్నాయి. అవన్నీ వేరు వేరు కాంతితో వుండడం బాగా లేదనుకున్నాడు, తనవెర్రిగాని. వాటన్నిటినీ సరిసమానంగా మార్చడం తనకి సాధ్యమా? ఈ వెర్రి ఆలోచనలో పడి దొరగారు బయటకువచ్చినా గుర్తించలేకపోయాడు. అమ్మగారు,"ఏం రామయ్యా! నిద్రపోతున్నావా?" అంటుండగా సిగ్గుపడుతూ లేచి నిలుచున్నాడు.

దొరగారు చేతులుకడుక్కుని భార్యతోసహా పడకగదిలోకి వెళ్ళేరు. రామయ్య ఆరుబయట పచారుచేస్తున్నాడు జీతపురాళ్ళకి ఎదురుచూస్తూ. ఇంతలో లోపల ఏదో అలజడి అవుతూన్నట్లు వినవచ్చింది. దొరగారి గొంతు గట్టిగా వినిపిస్తూంది. భార్య బయటికివచ్చి రామయ్యతో ఆయన లోనికి రమ్మన్నారని చెప్పింది, రామయ్య బ్రహ్మానందపడ్డాడు సొమ్ము చేతిలోపడుతూందని.

గదిలోకి వచ్చేరాగానే నిర్ఘాంతపోయాడు రామయ్య. దొరగారు చేతిలో పేకబెత్తం దాల్చి ఉగ్రమూర్తిలా నిలుచున్నారు. ఆయన కళ్ళు ఎర్రగా చింతనిప్పుల్లా వున్నాయి. ఆయన రామయ్యను చూడగానే

"ఏది నా పర్సు? ఎక్కడ దాచేవో చెప్పు"

"పర్సేమిటి బాబయ్యా"అన్నాడు మెల్లగా.

"ఏమీ యెరగనట్లు నటించి లాభంలేదు. మంచిమాటలతో ఇచ్చేస్తావా ఇచ్చెయ్యి... లేదా డొక్కచీరేస్తాను తెలుసా!"అన్నారు దొరగారు. రామయ్యకి ఆ యిల్లువిరిగి మీదపడుతూన్నట్లనిపించింది. దొరగారు ఏం మాట్లాడుతున్నారో తెలుసుకునేందుకు కొట్టుకుపోతున్నాడు. ఇంతలో ఆయన పేకబెత్తంతో నడ్డిమీద ఒకటేసి "మాట్లాడవేంరా రాస్కెల్"అని గర్జించాడు. రామయ్య ఒక్కమారు బెరుమన్నాడు. ఎలాగో తమాయించుకుని "నాకేం తెలియదండి. నేనల్లాంటివాణ్ణి కాను. ఇంతకీ ఎప్పుడు, ఎక్కడ పోయింది మీ పర్సు!"అనగలిగేడు. దొరగారు కాస్త చప్పబడి—

"నాదగ్గర బొంకి లాభం లేదు. మంచిగా యిచ్చెయ్యి వదిలేస్తాను. లేదా, పోలీసులే చెప్పిస్తారు నిజం"అన్నారు. రామయ్య కళ్ళంట నీళ్ళు గిర్రున తిరిగేయి. తనమీదబడ్డ అభాండం బ్రహ్మాండమంత బరువుందనిపించింది. తాను మోయలేనిది. తన జీవితాన్ని ముక్కలుముక్కలుగా నలగగొట్టేదిలా తోచింది. కాని, గత్యంతరమేమిటి? ఇంతలో బయట కారు ఆగిన శబ్దమయింది. వెనువెంటనే బూట్ల టకటకలు—పోలీసులను చూసేసరికి పంచప్రాణాలూ పోయినట్లనిపించింది రామయ్యకు. ఇద్దరు జవానులువచ్చి జబ్బలుపట్టుకున్నారు. దొరగారు పోలీసులతో ఏదో మాట్లాడేరు. వాళ్లు రామయ్యను జీపులో కుదేసి తీసుకుపోయారు.

అటుపిమ్మట దొరగారు భార్యతో అన్నారు "చూసేవా! రామయ్య, రామయ్యంటావు!మిగతా వెయ్యి అక్కడే బ్యాంకులో పడేసేను గనుక నాలుగు వందలతో సరిపోయింది. ఈ కాడికి అదృష్టవంతులమే అనుకో"

"మీరుమాత్రం పర్సు ఆఫీసులో వదిలిపెట్టి రాలేదుగదా?" అన్నదామె.

"అదేం మాట? దారిలో పర్సు తీసి బ్రహ్మానందానికి పదిరూపాయ లిచ్చి, మళ్ళీ జేబులోనే పెట్టుకున్నాను."

"ఎందుకో నాకు రామయ్యమీద అనుమానం కలగడంలేదు."

"తెల్లనివన్నీ పాలనే నీ నమ్మకం. వాడు కాక పోతే ఎవడు కొట్టెయ్యడానికి ఆస్కారం వుందో చెప్పు. మనం భోజనం చేస్తున్నప్పుడు తీసేసి వుంటాడు. అందుకే పోలీసులు లాకేదుతున్నా కిక్కురుమనలేదు. అదంతా ఎందుకు ప్రొద్దున్నకి వాళ్ళే చెప్పేస్తారు."

"ఇంతకీ మనం పిచ్చుకమీద బ్రహ్మాస్త్రం వెయ్యలేదుగదా!" అంది భార్య.

"అవసరమైతే వెయ్యాలిమరి. రాముడంతవాడికే కాకిమీద బ్రహ్మాస్త్రం వెయ్యకతప్పలేదు" అన్నారు దొరగారు.

మరునాటి ఉదయం లేచీ లేవగానే దొరగారు పోలీసుస్టేషనుకు ఫోను చేసేరు. వచ్చిన జవాబేమంత ఆశాజనకంగా ఉండి వుండదు. ఏమంటే ఆయన ముఖం విచారకరంగానూ కాస్త కోపంగానూ వుంది. ఎప్పటిలాగ తయారయి తొమ్మిదింటికే మోటారు సైకిలుమీద ఆఫీసుకి బయలుదేరేరు. ఆఫీసు ఇంకా మైలు దూరం వుందనగానే ఒక వీధి మలుపు తిరగుతుండగా, ఒక పన్నెండేళ్ళ పిల్ల సైకిలు ఆపమని చెయ్యి చాపింది. దొరగారు విసుక్కుంటూ ఆపేరు. ఆ పిల్ల తన అరచేతిని చూసుకుంటూ, తిరిగి ఆయనకేసి చూస్తూ నిలబడింది. ఆయన ఒళ్లు మండి "ఏం కావాలి చెప్పు" అని గర్జించారు. "మా నాన్నగారు మిమ్మల్ని పిలుస్తున్నారు. పైన వున్నారు" అంటూ రోడ్డు ప్రక్కన వున్న మేడ చూపెట్టింది ఆ పిల్ల.

"మీ నాన్న యెవరు? నన్నెందుకు రమ్మంటున్నారు?" అన్నారు దొరగారు.

"మా నాన్న పేరు విశ్వాసరావుగారు. తాలూకాఫీసులో గుమాస్తా. అవును. నిజంగా మిమ్మల్నే పిలుస్తున్నారు" అంటూ ముందు దారితీసింది ఆ పిల్ల. దొరగారు ఆశ్చర్యపడుతూ ఆమె ననుసరించేరు. మేడ ఎక్కగానే ఆపిల్లతండ్రి చెవులో ఏదోచెప్పి, అరచేతిలో ఏదోపెట్టింది. ఆయన దొరగారిని చూసి కూర్చోమని సౌంజ్ఞచేసి "మీరేమన్నా పారేసుకున్నారా?" అని అడిగేడు. దొరగారు కాస్త కంగారుపడి, లేదనబోయి, తిరిగి సర్దుకుని "ఆఁ. నా పర్సుపోయింది. మీకేమన్నా దొరికిందా?" అన్నారు.

"ఎప్పుడు పోయింది? ఏ రంగుది?" అని ప్రశ్నించేడు పిల్లతండ్రి.

"నిన్నరాత్రి పోయింది. ఎరుపురంగు పర్సు. జిప్పు వుంటుంది"...

"అందులో ఎంత సొమ్ముంది?"

"మూడువందల ఎనభైఅయిదు రూపాయల నోట్లూ కొంత చిల్లరావుంది"...

ఆపిల్లతండ్రి లోనికివెళ్ళి పర్సు తెచ్చియిస్తూ.

"ఇది నిన్నసాయంత్రం వీధిలో మాపిల్లకి దొరికింది. ఈ పర్సులోవున్న చిన్నఫోటో తీసుకుని ఆమె మిమ్మల్ని ఆనవాలు కట్టింది" అన్నాడు. దొరగారు నిర్ఘాంతపోయారు. ప్రపంచంలో ఇంతటి న్యాయవంతులున్నారని ఆయన ఎన్నడూ తలపోయలేదు.

"నోట్లు లెక్కచూడండి" అన్నాడు మళ్ళీ ఆ పిల్లతండ్రి..

"ఎంతమాట, చాలా చాలా ధన్యవాదాలు. మళ్ళీ కలుసుకుంటాను" అంటూ పర్సు జేబులో పెట్టుకుంటూ మెట్లుదిగిపోయారు దొరగారు. సైకిలు సమీపించగానే నిన్నసాయంత్రం బ్రహ్మనందానికి పదిరూపాయలిచ్చిన స్థలం అదేనని గుర్తించుకున్నారు. ఇంతలో రామయ్య ఆయన మనస్సులో తళుక్కుమన్నాడు. తెలిసీ తెలియకుండానే మోటారు సైకిలు పోలీసు స్టేషన్‌కి దారితీసింది. అక్కడ ఏంమాట్లాడేరోగాని రామయ్యను వెంటబెట్టుకుని అరగంటలో ఇల్లు చేరుకున్నారు. వెంటనే అతని నెలజీతం నలభైరూపాయలు ఇచ్చేసి ఇలాగన్నారు "చూడు రామయ్యా! నాపర్సు ప్రొద్దున్నే ఆ మొక్కల్లో దొరికింది. అది ఎవరు తీసి పారేసేరు అనేది ఇక ఆలోచించను. అయినదేదో అయిపోయింది. నా సొమ్మునాకు దొరికింది. జరిగినదంతా నేను మరచిపోతాను. నువ్వూ మరచిపోయి ఎప్పటిలాగ పని చేస్తావు గదూ?" రామయ్య కాస్త నిస్సత్తువతో ఆలోచించి, "చిత్తం!" అన్నాడు. దొరగారిలా పూటకి సెలవియ్యగా, మహారాజులా రామయ్య తన యింటివేపు నడచిపోతున్నాడు. ★